క్లుప్తంగా

ఇంటి నిర్మాణం నిలిపివేత

జడ్చర్ల: బాదేపల్లిలోని చెరువుకట్ట సమీపంలో పోచమ్మ ఆలయానికి వెళ్లే రహదారిని ఆక్రమించి, చేపట్టిన ఓ ఇంటి నిర్మాణ పనులను మంగళవారం వార్డు కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది నిలిపివేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో విచారించి, పిల్లర్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అక్కడ ఇనుప చువ్వలను తొలగించి, పిల్లర్ గుంతలను పూడ్చివేశారు.

పండ్లు పంపిణీ



జడ్చర్ల: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో మంగళవారం పట్టణంలోని పలు మసీదుల వద్ద బీఆర్ఎస్ నాయకులు ముస్లింలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్మోహన్, శ్రీకాంత్, ఇమ్ము, దానీష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించండి



కోయిల్‌కొండ: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదురింటి నర్సింహులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా జీపీల్లో వెయ్యి మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని.. వారికి ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీపీ అకౌంట్లలో డబ్బులు లేకపోవడంతో కార్మికులకు వేతనాలు ఇవ్వలేకపోతున్నామని అధికారులు చెప్పడం సరికాదన్నారు. కార్మికులకు ప్రతినెలా వేతనాలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకటయ్య, రాములు, చెన్నయ్య, బుచ్చమ్మ, మొగులయ్య ఉన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా మల్లేష్



నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్ నియమితులయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఓబీసీ సెల్ నాయకుల ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌గౌడ్ తనకు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. తిరుపతయ్య, శ్రీను, ఆంజనేయులు, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల పోస్టర్ ఆవిష్కరణ

నారాయణపేట రూరల్: పట్టణంలోని సంత్ మఠ్ మూల మహాసంస్థానం ఆధ్వర్యంలో ప్రదానం చేయనున్న ఉగాది పురస్కారాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం శక్తిపీఠంలో విడుదల చేశారు. ఈసందర్భంగా శక్తిపీఠం వ్యవస్థాపకుడు శాంతానంద్ పురోహిత్ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈనెల 9న ఉగాది పురస్కారాలు ప్రదానం చేయడంతో పాటు పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పచ్చడి వితరణ ఉంటుందన్నారు. మరికల్‌కు చెందిన న్యాయవాది లక్కాకుల అయ్యప్ప, నారాయణపేటకు చెందిన ఆధ్యాత్మిక వేత్త సూగురప్ప, ఊట్కూర్‌కు చెందిన విద్యావేత్త, జీహెచ్ఎం రమేష్‌శెట్టి, నారాయణపేటకు చెందిన వ్యాపారవేత్త రవికుమార్‌గౌడ్, న్యాయవాది రఘువీర్ యాదవ్‌లకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. యాద్గీర్‌నారాయణరెడ్డి, మధన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలొని వెలుగొమ్ముల గ్రామశివారులో దుందుభి వాగు నుంచి మంగళవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జడ్చర్ల: పట్టణంలోని బూరెడ్డిపల్లి స్టేజీ వద్ద జాతీయరహదారిపై మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. బూరెడ్డిపల్లి స్టేజీ వద్ద కారు యూటర్న్ తీసుకుంటుండగా.. వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ప్రమాదంలో సురేందర్‌రెడ్డి, సయ్యద్‌లకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

ప్రమాదఘంటికలు..!

■ మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్‌కు చెందిన ఓ రైతు ఇటీవల ఒకదాని తర్వాత ఒకటి నాలుగు బోరుబావులు తవ్వించాడు. రెండు బోరుబావుల్లో చుక్కనీరు రాలేదు. ఒక బోరులో కొంత మేర నీళ్లు వచ్చినా.. నెల రోజులకే పూర్తిగా ఎండిపోయింది. మరో బోరులో ఇంచున్నర నీళ్ల పడగా.. సింగిల్ ఫేజ్ మోటారు ఏర్పాటుచేశాడు. దాంతో పొలం మొత్తం నీరు పారకపోవడంతో దాదాపు సగం పంట ఎండిపోయింది.

■ గండేడ్‌కు చెందిన మరో రైతు తన చెల్క పొలంలో ఓ బోరుబావి తవ్వించగా.. దుమ్ము మాత్రమే వచ్చింది. దీంతో మరో బోరును 600 ఫీట్ల మేర తవ్వించినా చుక్కనీరు రాలేదు. .. ఇలా భూగర్భజలాల కోసం కొందరు విచ్చలవిడిగా బోరుబావులను తవ్విస్తుండటం ఆందోళనకు గురిచేస్తోంది.

- అడుగుంటిన భూగర్భజలం
- పంటలను కాపాడుకునేందుకు విచ్చలవిడిగా బోరుడ్రిల్లింగ్
- వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్న వైనం
- ప్రశ్నార్థకంగా మారుతున్న భవిష్యత్



గాధిర్యాల్‌లో మూతపడిన బోరుబావి



నీళ్లు లేక వెలవెలలాడుతున్న జంగంరెడ్డిపల్లి చెరువు

గండేడ్: ఓవైపు భూగర్భజలం అడుగంటిపోవడం.. మరోవైపు విచ్చలవిడిగా బోరుబావుల తవ్వకాలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. ఎలాగైనా పంటలను కాపాడుకోవాలన్న ఉద్దేశంతో కొందరు ఎక్కడ పడితే అక్కడ బోరుడ్రిల్లింగ్ చేయిస్తున్నారు. దీన్ని అరికట్టాల్సిన అధికారులు.. చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. గండేడ్ మండలంలో 27 గ్రామపంచాయతీలు ఉండగా.. 20 వరకు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. 11 నోటిఫైడ్ చెరువులు.. సాలార్‌నగర్ ప్రాజెక్టు ఉంది. జియోగ్రాఫికల్ ఏరియా మొత్తం 30,493 ఎకరాలు ఉండగా.. 25,545 ఎకరాలు సాగుభూమి. 3,345 ఎకరాల్లో బత్తాయి, మామిడి , దానిమ్మ, జామ తదితర పండ్లతోటలు పెంచుతున్నారు. మరో 15,804 ఎకరాల్లో వరి, జొన్న, పత్తి, రాగులు, కంది తదితర పంటలను సాగుచేస్తున్నారు. పంటల సాగుకు చెరువులు, కుంటలతో పాటు బోరుబావుల నీటిని వినియోగిస్తున్నారు. ఇటీవల బోరుబావులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు.

ఎండుతున్న చెరువులు..

చెరువుల్లో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. ఉన్న పంటలకు సైతం నీరందే పరిస్థితి లేదు. మహమ్మదాబాద్ మండలంలోని మల్కచెరువు, గాధిర్యాల్ ఊరచెరువు, బ్రాహ్మణ్ చెరువు, మొకర్లాబాద్ లింగమయ్య చెరువు, గండేడ్ మండలంలోని వెన్నాచేడ్ పెద్ద చెరువు, పగిడికుంట, గండేడ్ ధ్యావల్ చెరువు, జంగంరెడ్డిపల్లి దేవుని చెరువు, రెడ్డిపల్లి మల్లయ్య చెరువు తదితర చెరువుల్లో నీటిమట్టం పూర్తిగా తగ్గడంతో కళావిహీనంగా మారాయి.

బోరుబావులే దిక్కు..

గతేడాది వర్షాభావ పరిస్థితులతో రైతులకు బోరుబావులే దిక్కవుతున్నాయి. ఎకరా పొలం ఉన్నా బోరుడ్రిల్లింగ్ చేయించాలని ఆలోచిస్తున్నారు. ఫలితంగా బోరుబావుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. మండలంలో దాదాపు 2,500 పైగా బోరుబావులు ఉన్నాయి. చెరువులు, కుంటల ద్వారా 5 వేల ఎకరాల వరకు నీళ్లు పారితే.. మిగతా 10 వేల ఎకరాల పంటలకు బోరుబావులే దిక్కయ్యాయి. ఈక్రమంలో నెల రోజులుగా బోరుబావుల తవ్వకం విపరీతంగా పెరిగింది. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో అందరూ కొత్త బోర్ల తవ్వకంపై దృష్టి సారిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ బోరుబావులను తవ్వుతున్నారు.

పశువులకూ కష్టకాలమే..

రైతుల ప్రధాన వనరుల్లో పశుసంపద ఒకటి. వ్యవసాయంతో అనుబంధంగా పశుసంపదతో ఉపాధి పొందుతున్నారు. వ్యవసాయంలో పశువుల వినియోగం తగ్గినా.. పాడి ఉత్పత్తి కోసం పశువులను పెంచుతున్నారు. ప్రస్తుతం పశువుల తాగునీటి కోసం రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికే చాలా గ్రామాల్లోని చెరువుల్లో నీరు అడుగంటింది. రానున్న రోజుల్లో సమస్య మరింత జఠిలం కానుంది. పశువుల తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నిర్మించిన నీటితొట్టిలు చాలా గ్రామాల్లో శిథిలమై నిరుపయోగంగా మారాయి.

వాల్టా చట్టానికి తూట్లు..

విచ్చలవిడిగా బోరుబావులు తవ్విస్తూ, వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం అనుమతులు లేకుండా బోర్లు తవ్వరాదు. ఒకవేళ బోరు వేయాలన్నా ముందస్తు అనుమతులు తప్పనిసరి. రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే, వారు జియోలజిస్టుకు రాస్తారు. ఆయన రిపోర్టు ప్రకారం బోరుడ్రిల్లింగ్ చేయడానికి అనుమతిస్తారు. ఇందుకు సంబంధిత రైతు కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇవేవి పట్టించుకోకుండా, ఎక్కడపడితే అక్కడ బోర్లు తవ్వుతున్నారు. ఇష్టానుసారంగా బోరుబావులను తవ్వుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..

ఎవరైనా వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా బోరుడ్రిల్లింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే, చర్యలు చేపడతాం. నిర్ణీత దూరాన్ని పాటించకుండా బోరుబావులు తవ్వితే కేసులు నమోదుచేస్తాం. గ్రామాల్లో అనుమతులు లేకుండా బోరుడ్రిల్లింగ్ చేయరాదు.

– నాగలక్ష్మి, తహసీల్దార్, గండేడ్



మహమ్మదాబాద్‌లో బోరుడ్రిల్లింగ్

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీఓ సాజిద్ ఉన్నీసాబేగం

గండేడ్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య తక్కువగా ఉందని.. ప్రతి గ్రామంలో కనీసం 100 నుంచి 150 మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని అడిషనల్ డీఆర్డీఓ సాజిద్ ఉన్నీసాబేగం అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కూలీలకు కొంతకాలంగా కూలి డబ్బులు సక్రమంగా అందకపోవడంతో పనులకు రావడానికి ఆసక్తి చూపడం లేదని పలువురు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. ఉగాదిలోగా పెండింగ్ కూలి డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పనిచేసే చోట కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కూలీల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. వేసవి దృష్ట్యా నర్సరీల్లో మొక్కలకు క్రమం తప్పకుండా నీరందించి, కాపాడాలని సూచించారు. సమావేశంలో ఏపీడీ శ్రీపాద్, అంబుడ్స్‌మెన్ సంతోష్, ఎంపీడీఓ దేవన్న, ఏపీఓ హరిశ్చంద్రుడు ఉన్నారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

నవాబుపేట: మండలంలోని లోకిరేవులో అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న దుబ్బ సత్యయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. సత్యయ్య కిరాణా దుకాణంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో విక్రయించేందుకు నిల్వచేసిన నాలుగు కాటన్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిడ్జిల్: మండలంలోని మసిగొండ్లపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్‌జీ కిరాణా దుకాణంలో మంగళవారం దాడులు నిర్వహించి, 5.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. బెల్టుషాపు నిర్వహిస్తున్న ఈశ్వర్‌జీపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కురుమ యాదవులకు న్యాయం చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పాలమూరు: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కురుమ యాదవుల నుంచి వసూలుచేసిన గొర్రెల యూనిట్ల డీడీలను వడ్డీతో సహా చెల్లించి, న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం కలెక్టర్ జి.రవి నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేపీ నేత కె.రాములుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 16వేల మంది గొర్రెల పథకానికి దరఖాస్తు చేసుకోగా.. కేవలం 1,377 మందికి మాత్రమే పంపిణీ చేశారన్నారు. మిగిలిన వారు రెండేళ్లుగా చెల్లించిన డీడీల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఒక్కో యూనిట్ కింద లబ్ధిదారు వాటాగా రూ.47 వేలు చెల్లించారని.. మొత్తం రూ.48 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని తెలిపారు.

- మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణపై కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తే, సహించేదిలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటికైనా పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సూచించారు.
- మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల బీజేపీ స్పోక్ పర్సన్స్‌గా రాములు, కొండా ప్రశాంత్‌రెడ్డి, బాలవర్ధన్‌గౌడ్, మెట్టుకాడి శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డిలను నియమించారు.
- పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ పార్లమెంట్ ప్రభారి నరేందర్‌రెడ్డి కోరారు. అన్నారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాలమూరు పట్టణశక్తి కేంద్ర ఇన్‌చార్జీల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పద్మజారెడ్డి, బాలరాజు, కృష్ణవర్ధన్‌రెడ్డి, సత్యం, పాండురంగారెడ్డి, అంజయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 39వ వార్డు రాజేంద్రనగర్, శెట్టి కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ప్రజలకు తడి, పొడి చెత్తపై మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి, పొడిచెత్తను వేరుచేసి ఇవ్వాలని సూచించారు.

త్వరలో ఓబీసీ కాంగ్రెస్ బహిరంగ సభ



పవన్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించిన నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కాంగ్రెస్ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో త్వరలోనే పాలమూరులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో పార్టీ ఓబీసీ విభాగం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో తమ విభాగం కీలక పాత్ర పోషించిందన్నారు. బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులు పవన్‌కుమార్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. సమావేశంలో ఎస్పీ వెంకటేష్, చంద్రకుమార్‌గౌడ్, మోహన్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య, పట్టణ అధ్యక్షుడు బండి మల్లేష్, ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసాచారి, అంజి, దేవేందర్, విజయ్‌కుమార్, నక్క శ్రీను పాల్గొన్నారు.

బహుజనులను కడుపులో పెట్టుకుంటా



సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బహుజనులను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని మహబూబ్‌నగర్ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలతో కలిసి సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్థానిక ప్రజల కష్టాలు తనకు తెలసని.. ఈప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు.

బహుజనులు ఎదుగుతుంటే కళ్లమంట..

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి బహుజన వ్యతిరేకి అని.. బహుజనులు ఎదుగుతుంటే ఓర్వలేకపోతున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. స్థానిక ట్యాంక్‌బండ్ వద్ద సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు తాను ఎన్నడూ కృషి చేయలేదని.. ఇక్కడ భూకబ్జా చేశానని తప్పుడు ఆరోపణలు చేస్తుండటంపై మండిపడ్డారు. తాను ఇల్లు కట్టుకుంటే కూడా కళ్లలో మన్ను పోసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరుచేస్తూ, జీఓ విడుదల చేసిందని.. కళ్లు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. పాలమూరులో తాను ఇంచు భూమి కబ్జా చేసినా రాష్ట్రాన్ని వదిలివెళ్తానని.. ఆరోపణలను రుజువు చేయాలని డిమాండ్‌చేశారు. బలహీన వర్గాలపై జరుగుతున్న కుట్రలను జిల్లా ప్రజలు గమనిస్తున్నారని.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీల నుంచి పోటీచేసిన ఇద్దరు నాయకులు ఏకమై తనను ఓడించారన్నారు. బహుజన నాయకులు ఎదుగుతుంటే ఓర్వలేని వారికి తగి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్, ఎంపీపీ సుధాశ్రీ, రాజేశ్వర్‌గౌడ్, కట్టా రవికిషన్‌రెడ్డి, గణేశ్, కరుణాకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరాటయోధుడు సర్వాయి పాపన్న

రాజాపూర్: బహుజనుల రాజ్యాధికార పోరాటయోధుడు, దొరల అరాచకాలను ఎదురించి, తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని గౌడ సంఘం మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ కొనియాడారు. సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం యూత్ అధ్యక్షుడు చంద్రకాంత్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్, ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.



రాజాపూర్‌లో పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

జీవితంలో ఉన్నతంగా రాణించాలి



ఆశ్రమ విద్యార్థులతో అడిషనల్ డీఎంహెచ్ఓ శ్రీధర్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని, జీవితంలో ఉన్నతంగా రాణించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ శ్రీధర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని అనురాగిణి ఆశ్రమ విద్యార్థులకు మ్యాన్‌కైండ్ ఫార్మ లిమిటెడ్ నిర్వాహకులు వితరణచేసిన స్కూల్ బ్యాగులు, టిఫిన్ బాక్స్, వాటర్ బాటిళ్లు, విద్యాసామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా అడిషనల్ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ విద్యార్థులు ఆశ్రమంలోని వసతులను సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని.. భవిష్యత్‌లో అనాథల సంక్షేమానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. తన వంతుగా విద్యార్థులకు ఉచితంగా వైద్యం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు మంచన విఠలయ్య, ఫార్మ కంపెనీ మేనేజర్ రాజ్‌కుమార్, కృష్ణారెడ్డి, గోనెల రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

అడ్డాకుల: విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుతో పాటు ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా నరేష్, కార్యదర్శిగా జీవరత్నంలను ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ప్రసాద్, సంతోష్, రాజు, సుధాకర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మిడ్జిల్: మండలంలోని కంచన్‌పల్లిలో మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఓ రాందాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి, మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఓ రాందాస్

అంధకారంలో ఎన్‌హెచ్-44 సర్వీస్‌రోడ్లు



వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సిన సర్వీస్‌రోడ్డు

జడ్చర్లటౌన్: 44వ నంబర్ జాతీయరహదారి సర్వీస్‌రోడ్లు అంధకారంలో మగ్గుతున్నాయి. జడ్చర్ల క్రాస్‌రోడ్డు నుంచి కావేరమ్మపేట వరకు ఫ్లెఓవర్‌ను అనుసరించి ఉన్న సర్వీస్‌రోడ్లపై వీధిలైట్లు లేకపోవడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వాహనదారులకు సర్వీస్‌రోడ్లు కీలకం. ఓవైపు కావేరమ్మపేట మున్సిపల్ కార్యాలయం నుంచి క్రాస్‌రోడ్డు వరకు.. మరోవైపు ఏఎస్ఆర్ గార్డెన్ నుంచి క్రాస్‌రోడ్డు వరకు వీధిదీపాలు లేకపోవడంతో రాత్రిళ్లు అంధకారం నెలకొంటోంది. దీంతో పోచమ్మ ఆలయం, దాచని వెంకట్‌రెడ్డినగర్, కావేరమ్మపేట, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఏఎస్ఆర్ గార్డెన్‌వైపు రాత్రివేళ వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఎటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియక భయాందోళనకు గురవుతున్నారు. దాంతోపాటు మహిళలు చైన్‌స్నాచర్ల బారిన పడే అవకాశం ఉంది. సర్వీస్‌రోడ్లపై మహిళలు ఒంటరిగా వెళ్లేందుకు జంకుతున్నారు.

ప్రమాదకరంగా మలుపు..

44వ జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి వచ్చే సర్వీస్‌రోడ్డు ప్రమాదకరంగా మారింది. హైదరాబాద్ నుంచి వాహనాలు అతివేగంగా వస్తుంటాయి. ఈక్రమంలో సర్వీస్‌రోడ్డు మలుపు వద్ద ప్రయాణించే ద్విచక్ర వాహనాలు, ఆటోలు జాతీయరహదారి నుంచి వచ్చే వాహనదారులకు కనిపించకపోవడం వల్ల ఎప్పుడే ప్రమాదం చోటుచేసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. వీధిలైట్లు ఏర్పాటు చేస్తే, ప్రమాదాలను నివారించే అవకాశాలు ఉన్నాయి. సర్వీస్‌రోడ్లు మున్సిపాలిటీ పరిధిలో లేకపోవడం వల్ల వీధిదీపాలు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించడంలేదు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించి, వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.